తొలిరోజుల్లో పెరియార్ గాంధేయవాది. 1919 లో కాంగ్రెస్ పార్టీలో చేరి, ఈరోడు మునిసిపాలిటీకి ఛైర్మన్‌గా పనిచేశారు. ఖాదీ ప్రచారం, అస్పృశ్యతా నివారణ, కల్లుపాకల ముట్టడి, విదేశీ వస్తుబహిష్కారం - యిటువంటివాటిల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1921లో కల్లుదుకాణాల పికెటింగ్ కేసులో అరెస్టయ్యారు కూడా. ఆ ఉద్యమంలో ఆయన భార్యా, సోదరి పాల్గొన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో సైతం పాల్గొన్నారు. 1922లో మద్రాసు ప్రెసిడెన్సీ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ప్రభుత్వోద్యోగాలలో బ్రాహ్మణులు ఎక్కువగా వున్నారు కాబట్టి ఉద్యోగాలలో, కళాశాలల్లో అబ్రాహ్మణులకు రిజర్వేషన్ యివ్వాలని తిరుపూరులో జరిగిన సమావేశంలో వాదించారు. కానీ సమావేశం యీ ప్రతిపాదనను తిరస్కరించింది. 1925లో కాంచీవరం సమావేశంలో యిటువంటి చట్టంకోసం తీర్మానం చేయాలని ప్రతిపాదించి మెజారిటీ సభ్యులు తిరస్కరించడంతో ఆయన 1925లో పార్టీనుండి వైదొలగారు. పార్టీనుండి బయటకు వెళ్లడానికి ముందు ఆయన పాల్గొన్న వైకోమ్ సత్యాగ్రహం ఆయనకు పేరు తెచ్చి పెట్టింది. కేరళలోని ట్రావన్‌కోర్ సంస్థానంలో వైకోమ్ అనే చిన్న వూళ్లోని గుడిలో దళితులను రానిచ్చేవారు కారు. వైకోమ్‌లో ఈ ఉద్యమంలో తను పెరియార్ తన భార్యతో సహా పాల్గొందామనుకున్నారు.



వైకోమ్‌లో పెరియార్ విగ్రహం

కాంగ్రెస్ పార్టీ ప్రతీ చోటా హరిజనుల ఆలయప్రవేశానికి ఉద్యమించేది కానీ వేరే ప్రాంతంవారు పాల్గొంటే ప్రభావం వుండదని, కేరళలోని హైందవులే పూనుకోవాలని గాంధీ అభిప్రాయం. అయినా పెరియార్ అక్కడకు వెళ్లి అరెస్టయ్యారు. పెరియార్ శిష్యులు యీ సంఘటనను చాలా పెద్దగా చిత్రీకరిస్తారు. ఆయనకు "వైకోమ్ వీరన్" అనే బిరుదు నిచ్చి అక్కడ ఆయన విగ్రహం స్థాపించారు కూడా. కానీ కాంగ్రెస్ పార్టీ అప్పట్లో నడిపే "యంగ్ ఇండియా" వైకోమ్ సత్యాగ్రహం గురించి రాసిన రిపోర్టులో పెరియార్‌ను ప్రస్తావించలేదట. బ్రాహ్మణ నాయకత్వంలోని కాంగ్రెస్, కావాలని ఆయన పాత్రను విస్మరించిందని పెరియార్ శిష్యులంటారు.

కాంగ్రెస్‌నుండి బయటకు వచ్చాక 1926లో పెరియార్ ఆత్మగౌరవ (స్వయం మర్యాదై అన్నారాయన తమిళంలో) ఉద్యమం మొదలుపెట్టారు. ఈ ఆత్మగౌరవం అందరినీ ఉద్దేశించినది కాదు. బ్రాహ్మణేతరులకు మాత్రమే యీ 'ఆత్మగౌరవం'. వారు ద్రవిడులని, అసలైన తమిళులనీ, బ్రాహ్మలు ఆర్యులనీ, తమిళులు కారనీ ఎక్కడినుండో యిక్కడకు వచ్చి తమపై పెత్తనం చెలాయిస్తున్నారు కాబట్టి వారితో పోరాడి వాళ్లని తరిమికొట్టాలని పెరియార్ సిద్ధాంతం. కులంలో తప్ప రూపురేఖల్లో కాని, భాషలో కాని, సంస్కృతిలో కానీ భేదం లేని వారు భిన్నజాతులకు, భిన్న భాషాకుటుంబాలకు ఎలా చెందుతారో పెరియార్‌కే తెలియాలి. ఇటువంటి అశాస్త్రీయమైన వాదంతోనే ఆయన, ఆయన వారసులు 85 ఏళ్లగా తమిళనాడును ఏలుతున్నారు. తమిళబ్రాహ్మణుల వెబ్‌సైట్లు చూస్తే "మేం తమిళులం కాకపోతే మరేమిటట?" అనే దీనాలాపనలు వినిపిస్తాయి.

కాంగ్రెస్ ఉద్యమంలో హిందీప్రచారం ఒక భాగం. ఈనాడు కొందరు నార్త్ ఇండియన్స్ ప్రవర్తనతో విసిగి మనం హిందీ భాషను మనపై 'రుద్దడాన్ని' నిరసించవచ్చు. కానీ అప్పట్లో అది ఒక అవసరం. ఎందుకంటే ఇంగ్లీషువాళ్ల పాలనకు ముందు 'మన భారతీయులమంతా ఒకటే' అన్న భావన లేదు. 500 చిల్లర రాజ్యాల పాలనలో వుండేవాళ్లం మనం. ఒక ప్రాంతం వాళ్లను చూస్తే మరొకరికి అనుమానం. నదికి ఒక ఒడ్డున వున్నవారు అవతలి ఒడ్డునవారితో వైవాహికబంధాలు పెట్టుకోని కాలం అది. ఇంగ్లీషువారు వచ్చి ఇంగ్లీషు నేర్పిన తర్వాతనే మనమందరం ఒకరి బాధ మరొకరం అర్థం చేసుకుని కలిసికట్టుగా పరాయిపాలకులను ఎదిరించడం మొదలుపెట్టాం. కానీ ఆంగ్లం నేర్చుకున్న విద్యావంతులు జనాభాలో 5% కంటె వుండని ఆ రోజుల్లో జనసామాన్యం అర్థం చేసుకునే హిందూస్తానీ (హిందూ, ఉర్దూ మిశ్రమం) దేశప్రజలందరూ నేర్చుకోవాలని గాంధీ ప్రచారం చేశారు.

స్వాతంత్ర్యంకు ముందే జరిగిన స్థానిక ఎన్నికలలో నెగ్గి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడుతున్న కొద్దీ అవి హిందీని పాఠశాలలలో బోధించడాన్ని ప్రోత్సహించాయి. 1937లో రాజాజీ మద్రాసు ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రి అయి పాఠశాలల్లో హిందీని నిర్బంధంగా నేర్చుకోవాలని చట్టం అమలు చేయగానే పెరియార్‌కు మంచి అవకాశం దొరికింది. "హిందీ ఆర్యులభాష. దాన్ని మనపై రుద్ది మన తమిళభాషను, ద్రవిడ సంస్కృతిని నీచంగా చూస్తున్నారు, నాశనం చేస్తున్నారు బ్రాహ్మణుడైన యీ రాజాజీ, బ్రాహ్మణుల నాయకత్వంలో నడుస్తున్న యీ కాంగ్రెస్.." అంటూ ఆత్మగౌరవ ఉద్యమం మొదలుపెట్టారు.

దీనికి మూలాధారంగా నిలిచినది బ్రాహ్మణవ్యతిరేక ఉద్యమం. దానికి బీజాలు 1912లో పడ్డాయి. ప్రాంతంపేర కాని, కులంపేర గాని, మతంపేర గాని జరిగే యిటువంటి ఉద్యమాలన్నిటికీ వుండే ప్రధానకారణం ఎప్పుడూ ఉద్యోగాలే. మొదట్లో ఉద్యోగాలపై పెద్ద మోజు వుండేది కాదు. జీతాలు చాలా తక్కువగా వుండేవి. వ్యవసాయంపైనే ఆధారపడడానికి ప్రాధాన్యత యిచ్చారు. అయితే వ్యవసాయంలోని వ్యయప్రయాసలకు ఓర్వలేని బ్రాహ్మణులు కొందరు చదువులపై శ్రద్ధ పెట్టి, పల్లెటూళ్లలో భూములు అమ్ముకుని, ఉద్యోగాలకై, లాయర్లు, ఆడిటర్లు, డాక్టర్లు వంటి వృత్తులకై పట్టణాలకు తరలి వెళ్లారు. జీతం తక్కువైనా రిస్కు లేకుండా నెలనెలా నికరాదాయం రావడం, అధికారం చలాయించే సౌకర్యం వుండడంతో ఉద్యోగాలు క్రమేపీ యితరులను ఆకర్షించాయి. మొదట్లో ఉద్యోగాలకు వెళ్లినవారిలో చాలామంది బంధుప్రీతితో తమవాళ్లనే ఉద్యోగాలలో నియమించుకోవడంతో ఉద్యోగాలలో బ్రాహ్మణవర్గాల శాతం వారి జనాభాలో వారి నిష్పత్తికంటె ఎన్నోరెట్లు ఎక్కువ కావడంతో యితరులకు కన్ను కుట్టింది. ఉద్యోగాలకూ, ఉద్యోగార్హత సంపాదించి పెట్టే చదువులలోనూ తమకూ రిజర్వేషన్లు వుండాలని అలజడి మొదలుపెట్టారు. ఏదైనా సంస్కరణోద్యమంలో కాని,